జాడలేని ఆహార సలహా సంఘాలు

- రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు అవకాశం
- పట్టించుకోని అధికారులు


దిగువపాడు గ్రామంలో రేషన్ షాపు వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు (ఫైల్)

కర్నూలు(రూరల్): చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్‌పెట్టి, కార్డుదారులకు సజావుగా సరుకులు అందేలా చూడాల్సిన బాధ్యత ఆహార సలహా సంఘాలపై ఉంది. మూడు నెలలకోసారి ఆహార సలహా సంఘం ఆధ్వర్యంలో రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీపై సమీక్షించి తదనుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆహార సలహా సంఘాలేవీ కానరావడం లేదు.

కోడుమూరు నియోజకవర్గంలో గూడురు, సి.బెళగల్, కోడుమూరు, కర్నూలు రూరల్ మండలాలు ఉన్నాయి. సుమారుగా 167 చౌకదుకాణాల పరిధిలో 82,408కి పైగా రేషన్ కార్డుదారులు ఉన్నారు. రేషన్ దుకాణాల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసింది. సంఘం చైర్మన్‌గా సబ్ కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా తహసీల్దారు, సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యుడు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు, హాకర్స్ అసోసియన్ అధ్యక్షుడు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు ఉంటారు. ఆహార సలహా కమిటీకి రేషన్ షాపుల తనిఖీ, బియ్యం సరఫరాపై నిఘా, తూనికలు–కొలతలపై పర్యవేక్షణ అధికారాలు ఉంటాయి. అయితే ఇటీవల సంబంధిత అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి సమావేశాలను నిర్వహించిన దాఖలాలు లేకపోవడంతో రేషన్ డీలర్ల ఇష్టారాజ్యమైంది. చౌక దుకాణాల్లో ఇచ్చే సరుకుల నాణ్యతను పట్టించుకొనేవారు కరువయ్యారు. రేషాన్ షాపుల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో చోటు చేసుకుంటున్న సమస్యలపై లబ్ధిదారులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. షాపుల్లో సకాలంలో సరుకులు పంపిణీ చేయడం లేదని, నాణ్యత కూడా అంతత మాత్రమేనని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

ఎండీయూల రద్దుతో కమిటీల అవసరం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలు ఏర్పాటు చేసి రేషన్ కార్డుదారులకు ఇంటివద్దకే సరుకులను పంపిణీ చేసేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తురువాత ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో మళ్లీ ఆహార సలహా కమిటీల అవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో అధికారులు ఆహార సలహా కమిటీలను ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువుల పంపిణీని పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లోపించిన పర్యవేక్షణ



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించే వారు. నేను కర్నూలు మండల సంఘంలో సభ్యుడిగా పనిచేశాను. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపుల్లో చోటు చేసుకుంటున్న లోటుపాట్ల గురించి సమావేశాల్లో అధికారుల దృష్టికి సంఘం సభ్యులు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఘాలు పనిచేస్తున్నాయా? లేదా కూడా తెలియడం లేదు అధికారులు పట్టించుకోవడం లేదు. డీలర్ల సమావేశంలో మమ అనిపిస్తున్నారు. **–జి.అంజనేయులు, గొందిపర్ల**

చర్యలు తీసుకుంటాం



కర్నూలు మండలంలో ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుటాం. రేషన్ సరుకుల పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే సమాచారమిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తాం. త్వరలోనే ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసి సమావేశం నిర్వహిస్తాం. రేషన్ పంపిణీలో సమస్యలపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం. **– టీ.వీ.రమేష్‌బాబు, కర్నూలు**

పంట బీమాకు దరఖాస్తు చేసుకోండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రూఫస్‌రొనాల్డ్

కర్నూలు(రూరల్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రూఫస్‌రొనాల్డ్ సూచించారు. ఆయన గురువారం మండలంలోని పి.రుద్రవరం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లడుతూ.. రైతులు పంటల బీమాను మూడు రకాలుగా చెల్లించవచ్చని తెలిపారు. బ్యాంకుల్లో రుణం రెన్యూవల్ ద్వారా లేదా, కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా లేదా ప్రధన మంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్‌లో పంటల బీమాను నమోదు చేసుకోవచ్చునని వివరించారు. బీమా ప్రీమియం చెల్లించేందుకు వెళ్లేటప్పుడు 1బీ, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్, మొబైల్ నంబర్ తీసుకెళ్లాలని సూచించారు. అర్హత ఉండి జాబితాలో అనర్హులుగా పేర్కొనబడిన రైతులు స్థానిక రైతుసేవా కేంద్రల్లో తిరిగి ఆన్‌లైన్‌లో అర్జీలు పెట్టుకోవాలన్నారు. మండలంలోని కౌలు రైతులు కౌలు కార్డులు చేయించుకోవాలని సూచించారు. గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలం హద్దు విషయంలో ఇరువర్గాల ఘర్షణ

సి.బెళగల్: మండల పరిధిలోని మారందొడ్డి గ్రామంలో ఇరు కుటుంబాల ఘర్షణ కారణంగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు.. గ్రామంలో గురువారం భూముల రీసర్వేలో భాగంగా రెవెన్యూ అధికారులు పొలాల హద్దులను నమోదు చేసుకుంటున్నారు. బోయ వెంకటేష్ అనే వ్యక్తి తన పొలం హద్దు రోడ్డుకు అటువైపు వస్తుందంటూ కొలతల అధికారులకు మరో వ్యక్తి బోయ రుక్మంద పొలానికి దగ్గరగా హద్దు చూపాడు. పొలం హద్దు రోడ్డు దాటి ఎలా వస్తుందని వెంకటేష్ ప్రశ్నించడంతో ఇరు కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం ఏర్పడి ఘర్షణకు దారితీసింది. పరస్పర ఘర్షణలో వెంకటేష్ కుమారుడు మోహన్‌కు తలకు గాయమైంది. దీంతో గ్రామంతో గురువారం సాయంత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు కుటుంబాల వారిని స్టేషన్‌కు తరలించి ఉద్రిక్తతలను అదుపుచేశారు. ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పరమేష్‌నాయక్ తెలిపారు.

చెత్త సేకరణ పకడ్బందీగా జరగాలి


చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: గ్రామాల్లో చెత్త సేకరణ పకడ్బందీగా జరగాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం బస్తిపాడు గ్రామంలో పర్యటించి చెత్త సేకరణను పరిశీలించారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవన్నారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె.లక్ష్మన్న, నాయకులు సురేష్, పంచాయతీ కార్యదర్శి బిందుభార్గవి పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. గురువారం భూపనపాడు గ్రామంలోని బీసీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలనీ ప్రజలు డ్రైనేజీ సమస్య ఉందని పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో మురుగు కాల్వలు నిర్మించేందుకు స్థల సమస్య ఉండడంతో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ రామ్, వీఆర్‌ఓ బాలవీరాంజనేయులు ఉన్నారు.

కుంగిన డ్రైనేజీ కాంక్రీట్ బెడ్


ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామం వద్ద డ్రైనేజీపై నిర్మించిన కాంక్రీట్ బెడ్ కూలి పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్లను నిర్మించారు. రహదారిపై స్థానిక మసీద్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయడంతో గ్రామం నుంచి జాతీయ రహదారి పైకి వెళ్లేక్రమంలో గ్రామం లోపలికి వచ్చేటప్పుడు షమీర్ హోటల్ వద్ద డ్రైనేజీపై రెండు చోట్ల కాంక్రీట్ బెడ్ కూలి ప్రమాదకరంగా మారింది. హైవే అధికారులు ఫైబర్ నిరోధకాలతో తూతూమంత్రంగా కప్పి ఉంచారు. కానీ రాత్రివేళల్లో వాహనదారులు గుంతలు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారని, కాంక్రీట్ బెడ్‌ను నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులతో సామేల్

పాణ్యం: మండల పరిధిలోని కొలూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం సమితి రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ ఆధ్వర్యంలో గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం కమిటీ గ్రామ అధ్యక్షుడిగా నాగమద్దిలేటి, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మౌలాలి, కార్యదర్శిగా మద్దిలేటితోపాటు సభ్యులను ఎన్నుకున్నట్లు సామేల్ తెలిపారు.

జల్‌జీవన్ పనులను పర్యవేక్షించండి


సి.బెళగల్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ అన్నారు. ఆయన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ.. గ్రామాల్లో జరగుతున్న జరుగుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఈ మండలంలో నూతనంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా నియామకం అయిన వారిని పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సి.బెళగల్, చింతమానుపల్లె, పలుకుదొడ్డి గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా నీటి ట్యాంకు నిర్మాణ పనులు, ఇంటింటికీ కుళాయి పనులు జరుగుతున్నాయని, పనులు నాణ్యతగా జరిగేలా చూడాలన్నారు.

విద్యార్థుల్లో ప్రమాణాలను పెంపొందించండి


సి.బెళగల్ స్పెషల్ స్కూల్లో విద్యార్థులను పరీక్షిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. ఆమె గురువారం సి.బెళగల్‌లోని స్పెషల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, రికార్డులు, రిజిస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్కూల్ టీచర్లకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి ఒకటో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల్లో అక్షరాలను గుర్తించడంతో పాటు, రాయడం వంటి నైపుణ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ సూచించారు. హెచ్‌ఎం మురళి, టీచర్లు ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవాలు


అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు


గని చౌడేశ్వరీ అమ్మవారికి చీరె, సారె, ఒడి బియ్యం తీసుకువస్తున్న భక్తులు


కల్లూరులో వేడుకలకు హాజరైన భక్తులు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం ముగింపు సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారి రామకృష్ణ అమ్మవారికి మహాభిషేకం, అలంకరణ చేసి పుష్పార్చన జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమార్చన జరిపించారు. మహానైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చెన్నకేశవ భజన మండలి కళాకారులు భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చంద్రమౌళీశ్వరరావు, గౌరవాధ్యక్షులు స్వామిరెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

- **గడివేముల:** మండల పరిధిలోని గని గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారికి ఆశాడమాసం అమావాస్య సందర్భంగా గురువారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీరె, సారె, ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అర్చకులు కార్తీకశర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చన, పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- **కల్లూరు:** కల్లూరులో వెలసిన చౌడేశ్వరిదేవి జయంత్యుత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చౌడేశ్వరిదేవి దేవస్థానం, భజన బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చకులు మహాభిషేకం, లక్షపుష్పార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

కోడుమూరులో 10.4 మి.మీ. వర్షం

కోడుమూరు రూరల్: కోడుమూరులో చాలా రోజుల తర్వాత ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజామున వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురవడంతో 10.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా వానల్లేక ఒట్టిపోయిన పొలాల్లో ఉల్లి నాట్లు వేసుకున్న కోడుమూరు, వెంకటగిరి గ్రామాల రైతులకు ప్రస్తుతం కురుస్తున్న వానలు కొంత మేలు చేకూరుస్తున్నాయి. అయితే ఈ వానలు పైర్లకు కొన్ని రోజుల వరకు మాత్రమే సరిపోతాయని, భారీ వర్షాలు కురిస్తే తప్ప పైర్లకు మేలు చేకూరదని రైతులు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


బి.తాండ్రపాడులో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జి.రఘునాథ్

కర్నూలు(రూరల్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని కర్నూలు ఎంపీడీఓ జి.రఘునాథ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో ఎంపీడీఓ గ్రామ పంచాయతీ అధికారితో కలిసి పర్యటించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిత్యం చేపట్టాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలతో పాటు మురుగు నీటి నిల్వ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ అధికారులను అదేశించారు. అలాగే దోమల నియంత్రణపై ప్రజలకు అవగహన కల్పించాలని, ప్రజలు రాత్రివేళ దోమకాటు నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలను వినియోగించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ కర్తలకు నివాళి


ఉద్యమ కర్తల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ ఉద్యమ కర్తల చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. శాఖా గ్రంథాలయాధికారిని కౌసల్య ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకర్త పాతూరి నాగభూషణం వర్ధంతి, ఉచిత పబ్లిక్ లైబ్రరీ ఉద్యమ రూపశిల్పి, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని, ఆ మహనీయుల సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

వృక్షో రక్షిత ఏదీ?



మొక్కల పెంపకం కోసం ప్రభుత్వాలు పెద్దపెద్ద కార్యక్రమాలే చేస్తుంటాయి. వాటి ప్రచారానికి ఒక్కోసారి ప్రత్యేక నిధులు కేటాయించి ఖర్చు కూడా చేస్తుంటాయి. వాటిని మనం పెంచితే.. మనల్ని అవి బతికిస్తాయంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఉపన్యాసాలు ఇస్తూ ఉంటారు. కానీ ఆచరణలో మాత్ర పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తుంటారు. ఒక్క మొక్కను కూడా పెంచి పెద్దచేసింది లేదు. కనీసం ఎవరో పెంచిన చెట్లనైనా బతికించుకుందామనే ధ్యాసే లేదు. కొందరైతే దగ్గరుండి మరీ నరికేయిస్తుండటం బాధాకరం. ఇదో ఇక్కడ కనిపిస్తున్న చిత్రం అలాంటిదే.. గడివేముల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏళ్ల క్రితం నాటిన మొక్కలు పెరిగి పెద్దవై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నీడనిస్తున్నాయి. మంచి గాలినిస్తున్నాయి. ఒక్కోసారి వాటి కిందే తరగతులు కూడా నిర్వహిస్తుంటారు. అలాంటి చెట్ల వల్ల ఏమి ఎవరికి ఇబ్బంది కలిగిందో ఏమో ఉన్నఫలంగా నరికేస్తుంటే హెచ్‌ఎం, ఉపాధ్యాయులు చేష్టలుడిగి చూస్తుండిపోయారు. **– గడివేముల**

ప్రమాదకరంగా బ్రిడ్జి సైడ్‌వాల్


దెబ్బతిన్న సైడ్‌వాల్

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలో జాతీయరహదారిపై అడ్డవాగుపై ఉన్న బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు ఇటీవల సైడ్‌వాల్ దెబ్బతింది. బ్రిడ్జికి మరమ్మతులతోపాటు వెడల్పు చేసి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఆంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఆంజనేయులు సూచించారు. కలెక్టరేట్‌లోని పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో గురువారం రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు.. సమాచార హక్కు చట్టంపై ఆ శాఖ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005లో సమాచార హక్కు చట్టం వచ్చిందని, అవినీతి, అక్రమాలను నిరోధించేందుకు ఇది ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు, ఉద్యోగాల భర్తీ తదితర అన్నింటిలో సమాచార హక్కు చట్టం కింద సాధారణ ప్రజలకు సమాచారం కోరే హక్కు ఉందని, దీన్ని తిరస్కరించే అధికారం లేదన్నారు. గ్రామ స్థాయిలో ఉచితంగా, మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 చెల్లించి ప్రజలు సమాచారం కోరవచ్చని సూచించారు. అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడవులోపు ఇవ్వాలన్నారు. సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి జయన్న మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం వచ్చిన తర్వాత అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి కొంత మేర తగ్గిందని తెలిపారు. ఈ చట్టం వచ్చిన తర్వాత అధికారులు తప్పు చేయాలంటే భయపడుతున్నారని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోపు అడిగిన సమాచారం ఇవ్వకపోతే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను వేధించడం తగదు


మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ట్రేడ్‌లైసెన్స్ పేరుతో మునిసిపల్ అధికారులు చిరు వ్యాపారులను వేధించడం తగదని, ఒక్కో వ్యాపారికి రూ.7–8 వేల వరకు జరిమానా విధించడం దారుణమని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్, రోడ్డు సైడ్ వ్యాపారుల సంఘం నగర కార్యదర్శి ఎస్‌ఎండీ షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం సీఐటీయూ నాయకులు మునిసిపల్ అధికారులను కలిసి రోడ్డు సైడ్ వ్యాపారుల వ్యథలను వివరించారు. వడ్డీ వ్యాపారుల మాదిరిగా డబ్బులు వసూలు చేయడం తగదని, ట్రేడ్ లైసెన్స్ పేరుతో భారాలను ఎలా వేస్తారని ప్రశ్నించారు. అంతేగాక పన్ను కట్టకపోతే బండ్లు, త్రాసులను తీసుకెళ్లి వేధించడం ఏ మాత్రం భావ్యం కాదన్నారు. అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలి


అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో అసంపూర్తిగా ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం బృందం పాఠశాలలను సందర్శించి మధ్యలో నిలిచిపోయిన భవనాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఉన్న నేపథ్యంలో భవనాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే మంచినీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలని కోరారు. నాయకులు ఎస్‌ఎండీ షరీఫ్, పార్వతయ్య, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అర్హతలను పున:పరిశీలించాలి

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పబ్లిక్ ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్ (పీ – 4) పథకం కింద బంగారు కుటుంబాల అర్హతలను పున:పరిశీలించాలని నగరపాలక సంలస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. అలాగే మార్గదర్శకులను త్వరితగతిన గుర్తించాలని సూచించారు. గురువారం స్థానిక స్టేట్ బ్యాంకు ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పీ–4 పథకం కింద 10,600 కుటుంబాలను గుర్తించామని, అలాగే 629 మంది మార్గదర్శకులను ఇప్పటికే ఎంపిక చేశామన్నారు. 3,709 మంది బంగారు కుటుంబాలను ద త్తత తీసుకునేందుకు అనుసంధానం చేశామని, ఆగస్టు 15వ తేదీలోపు దత్తత తీసుకునేలా మార్గదర్శకాలను అన్వేషించాలన్నారు.ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అదే విధంగా ఆస్తి పన్ను, నీటి, కొళాయి, ట్రేడ్ లైసెన్సు వసూళ్లపై దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, సూపరింటెండెంట్ మజూరు బాష, స్పెషల్ ఆఫీసర్ సుహేయిల్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్లూరు అర్బన్ పరిధిలోని మట్టి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైకులు అదుపు తప్పి కింద పడిన ఘనలు కూడా ఉన్నాయని స్థానికులు తెలిపారు. **– కల్లూరు**